సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 9 । జనవరి । 2024



సోమశిలలో 32.020 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 32.020 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 30 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,170
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,763
3శాతం జీఎస్టీతో	రూ.5,936
నవర (8గ్రా)	రూ.47,488

గరిష్ఠం/కనిష్ఠం 27.5 /24.8

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 72 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా ఉంది. మంగళవారం చలిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ఈనెల మూడో వారంలో టిడ్కో గృహ ప్రవేశాలు



అధికారులతో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

నెల్లూరు(బారకాసు): ఈ నెల మూడో వారంలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 15,552, వెంకటగిరి పురపాలక సంఘ పరిధిలోని 1008 కలిపి మొత్తం 16,560 గృహ సముదాయాల్లో సామూహిక గృహ ప్రవేశాలు జరపనున్నామని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ వెల్లడించారు. సోమవారం నగరంలోని వెంకటేశ్వరపురంలో టిడ్కో గృహాలను ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మూడో వారంలోపు చివరి దశ నిర్మాణాల్లో ఉన్న గృహాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆయన వెంట టిడ్కో ఎస్‌ఈ జాన్ సైమస్‌రావు, ఈఈ ఉమాశంకరశాస్త్రి, డీఈఈ పార్థసారధి, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

నెల్లూరు (టౌన్): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు డీఈఓ గంగాభవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సెలవుల్లో ఆయా పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అంతర్జాతీయ యోగా పోటీల్లో జిల్లా వాసికి ప్రథమ స్థానం



పుదుచ్చేరి సీఎం రంగస్వామి చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న కావ్యశ్రీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): యోగా ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన గుంజి కావ్యశ్రీ ప్రథమ స్థానం సాధించింది. పుదుచ్చేరిలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి పాండిచ్చేరి సీఎం రంగస్వామి నుంచి ప్రథమ బహుమతి అందుకుంది. ఈ పోటీల్లో వివిధ దేశాలతో పాటు మన దేశంలోని 12 రాష్ట్రాల నుంచి దాదాపు రెండు వేల మంది యోగా క్రీడాకారులు పాల్గొన్నారు. మన జిల్లా వాసి ప్రథమ స్థానం సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు

ఉదయగిరి: దుత్తలూరు నుంచి ఉదయగిరి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు సోమవారం ఉదయం అదుపుతప్పి రోడ్డు మార్జిన్ దిగి కిందికి వెళ్లింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఆర్టీసీ అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలాన్ని ఆర్టీసీ అధికారులతో పాటు పోలీసులు పరిశీలించారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన ఒకటో సెమిస్టర్ పరీక్షకు 818 మంది విద్యార్థులకు 712 మంది హాజరుకాగా, 106 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నాయుడుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు తెలియజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 2,616 మంది విద్యార్థులకు గాను, 2,368 మంది హాజరుకాగా 248 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

శుద్ధ అబద్ధం



ఫ్లోరైడ్..ఉప్పు నీటి నుంచి ఉపశమనం కోసం ప్రజలు శుద్ధ నీటి వైపు మళ్లారు. స్థానిక సంస్థల ద్వారా సరఫరా అయ్యే నీటిని నిత్యావసరాలకు వినియోగిస్తూ తాగునీటికి శుద్ధ జలంపై ఆధారపడుతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని మినరల్ వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చి మినరల్ వాటర్ పేరుతో జనరల్ వాటర్‌నే ప్రజలకు విక్రయిస్తూ మోసం చేస్తున్నారు.

మినరల్ వాటర్ పేరుతో మోసం

- విచ్చలవిడిగా అనధికారిక వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు
- నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- మినరల్ పేరుతో జనరల్ వాటరే విక్రయం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



నెల్లూరులో అపరిశుభ్రంగా ఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో మారుమూల పల్లె నుంచి పట్టణాలు, నగరాల వరకు అన్ని చోట్ల దాదాపుగా బావి, బోరు, కుళాయి నీటి వినియోగానికి ప్రజలు మంగళం పలికారు. ఫ్లోరైడ్..ఉప్పు నీటి నుంచి ఉపశమనం కోసం శుద్ధ జలంపై ఆధారపడుతున్నారు. దాదాపుగా ఎక్కువ చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్లు సరఫరా చేసేది జనరల్ వాటరే అయినా మినరల్ వాటర్‌గానే భ్రమిస్తూ వినియోగిస్తున్నారు. జిల్లాలో ప్రతిరోజూ తాగునీటికి దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన నెలకు సుమారు రూ.3 కోట్లకు పైగా కేవలం మంచినీటికే ఖర్చు చేస్తున్న పరిస్థితి. జిల్లాలో శుద్ధ జలానికి గణనీయంగా డిమాండ్ ఏర్పడడంతో వీధికి ఒకటి చొప్పున అనధికారికంగా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఐఎస్ఐ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి మినరల్ వాటర్ పేరుతో జనరల్ వాటర్‌నే పైపైనే శుద్ధి చేసి సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో వీధివీధికి రెండు, మూడు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో సైతం మినరల్ కల్చర్‌ను తీసుకెళ్లి అక్కడా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు. వాటర్ క్యాన్‌ను ప్లాంట్ వద్దకెళ్లి కొనుగోలు చేస్తే రూ.10, ఇంటికి సరఫరా చేస్తే రూ.20 చొప్పున అమ్ముతున్నారు. జిల్లాలో 50 శాతం ఇళ్లకు సరఫరా, 50 శాతం ప్లాంట్ వద్ద కొనుగోళ్లు ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 550కుపైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో కేవలం 50 వాటర్ ప్లాంట్లకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు సమాచారం. మిగిలిన వాటిని అనధికారికంగానే నిర్వహిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్లకు సంబంధించి ఐఎస్ఐ సంస్థ 60 రకాల ప్రమాణాలను రూపొందించింది. ఈ ప్రమాణాలను పాటిస్తేనే వాటర్‌ప్లాంట్లకు అనుమతిస్తుంది. ఐఎస్ఐ నిబంధనలను తుంగలో తొక్కి వ్యాపారులు వాటర్‌ప్లాంట్లు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో మినరల్ వాటర్‌ప్లాంట్లు - 550	
ఐఎస్ఐ నిబంధనలు పాటించనవి - 500	నిత్యం సరఫరా చేసే వాటర్ క్యాన్లు - 75 వేలకుపైగా

దాడులు లేకపోవడంతోనే..

అనధికారిక, నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో వాటర్‌ప్లాంట్ల యజమానులు నిబంధనలు తుంగలో తొక్కి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నగర పాలక సంస్థలో వాటర్‌ప్లాంట్ల ఏర్పాటుకు శానిటేషన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ట్రేడ్ మార్కు విభాగం అనుమతులు ఉండాలి. కానీ ఇవేమీ లేకుండా వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి

ఆరోగ్యానికి ప్రమాదం

మినరల్ వాటర్‌లో టీడీఎస్ (లెడ్, ఫ్లోరిన్, నైట్రేట్, క్లోరైడ్స్) స్థాయి గరిష్ఠంగా 50–300 పీపీఎంలోపు ఉండాలి. కానీ వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు సరైన ప్రమాణాలు పాటించకపోవడంతో టీడీఎస్ స్థాయి రెట్టింపు ఉంటోంది. దీంతో దీర్ఘకాలంలో జీర్ణకోశ, ఉదర, కాలేయ, కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఎముకలు, పళ్లకు నష్టం వాటిల్లుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫ్లోరిన్ కనీసం 0.5 నుంచి 0.8 పీపీఎంలోపు ఉండాలి. ప్రస్తుతం విక్రయిస్తున్న నీటిలో 2 పీపీఎం కన్నా ఫ్లోరిన్ ఎక్కువగా ఉంటోంది. దీంతో బ్యాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెందుతాయని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాటర్‌ప్లాంట్లు సరఫరా చేసే జనరల్ వాటర్ కంటే కాచి చల్లార్చిన నీటిని తాగడమే మేలంటున్నారు.

కాచి చల్లార్చిన నీరే సురక్షితం

మంచినీటి శుద్ధి విషయంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి. కలుషిత నీరు తాగడం వల్ల ముఖ్యంగా మూత్రపిండాల జబ్బులతో పాటు ఎముకల్లో సాంద్రత తగ్గిపోతుంది. గుండె సంబంధిత వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి. పూర్తి ప్రమాణాలతో శుద్ధి చేసిన నీరు లేకపోతే కాచి చల్లార్చి వడకట్టిన సాధారణ నీటిని తాగాలి.

– డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, నెల్లూరు

రాజ్యాంగ నిర్మాతకు సముచిత స్థానం

- విజయవాడ నడిబొడ్డులో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



అంబేడ్కర్‌కు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తూ విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల విగ్రహం, స్మృతి వనాన్ని ఏర్పాటు చేసిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ భవన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి కాకాణి సోమవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయవాడలో రూ.404 కోట్లతో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, స్మృతి వనాన్ని నెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రభుత్వం ఈ నెల 12వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. అంబేడ్కర్ స్ఫూర్తిని భావిభారత పౌరులకు తెలియజేయాలని ఆయన జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన చంద్రబాబు

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధంగా దళితుల్లో పుట్టాలని ఎవరూ కోరుకోరని వ్యాఖ్యానించిన విషయాన్ని మంత్రి కాకాణి గుర్తుచేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి గాలికి వదిలేశారన్నారు. అందరికి వెన్నుపోటు పొడిచినట్టే అంబేడ్కర్ ఆశయాలకు బాబు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఆయనకు బడుగు, బలహీన వర్గాలంటే చిన్నచూపని, ఆయన సీఎంగా ఉన్న సమయంలో వారిని అవమానకరంగా మాట్లాడారని తెలిపారు. దళిత ద్రోహిగా ముద్ర వేసుకున్నందునే బాబుకు ఆ వర్గాల వారు దూరంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం పదవులు ఇచ్చి వారికి సముచిత స్థానం కల్పించిందని గుర్తుచేశారు. మంత్రి వెంట వైస్ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు లక్కు స్వరాజ్, పూకోటి లక్ష్మీనారాయణ, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎస్‌కే అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు సత్వరమే పరిష్కరించండి

- జేసీ కూర్మనాథ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం (స్పందన) అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకు ప్రజల నుంచి సుమారు 340 అర్జీలు అందాయని తెలిపారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా స్పందన అర్జీలను పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఎందుకు పరిష్కారం కాలేదో వివరించి రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. కాగా బీజేపీ నేతలు మిడతల రమేష్, కందికట్టు రాజేశ్వరిలు అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని దేవాదయశాఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలతో పండగ వాతావరణాన్ని నెలకొల్పాలని జేసీకి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు దాసరి రాజేంద్రప్రసాద్, కంచర్ల నారాయణయాదవ్, రంగరాజన్, ఆదినారాయణ, శ్రీరాములు, మారం కృష్ణ, నాగేంద్రసింగ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఏవీ రామ్మోహన్‌రావు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనల్లో మార్పు రావాలి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వీఎస్‌యూ వీసీ సుందరవల్లి

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పు రావాలని వీఎస్‌యూ వైస్‌చాన్సలర్ జీఎం సుందరవల్లి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్‌పై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు అమెరికాకు చెందిన స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ పీ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తాను చేపట్టిన వివిధ పరిశోధనలను వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలపై బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ విద్యార్థులతో సంభాషించారు. ఈ సందర్భంగా వీసీ సుందరవల్లి మాట్లాడుతూ శ్రీనివాస్ చేస్తున్న పరిశోధనలను ప్రశంసించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తమ పరిశోధనలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

10న జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు

నెల్లూరు(బారకాసు): నెహ్రూ యువకేంద్రం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో 'అభివృద్ధి చెందిన భారతదేశం–2047' అంశంపై జిల్లాస్థాయిలో ఈ నెల 10వ తేదీన వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు జిల్లావాసులై ఉండి 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ఈ పోటీలు ఉంటాయని, ఈ పోటీలను నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. 9963533440 ఫోన్‌నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

తైక్వాండో రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు, రెఫరీలు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయిలో మార్కాపురంలో రాక్వెల్ స్కూల్ ఆవరణలో సోమవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల తైక్వాండో ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు జిల్లా కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ సలాం తెలిపారు. ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 20, 21 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మార్కాపురం మొదటి స్థానం కైవసం చేసుకోగా చీరాల ద్వితీయ స్థానం, కందుకూరు తృతీయ స్థానంలో నిలిచాయి.

ఎంపికైన క్రీడాకారులు వీరే

బాలికల విభాగంలో.. సమత, తనుశ్రీ, కోమలి, దేవర్శిని, మేఘన, కీర్తి, సమీహా ఫాతిర, గోదా, జ్ఞాపిక బాలుర విభాగంలో.. లీలా మాధవ్, శన్ను, సాకేత్, మౌనిక, విజయ్‌కుమార్, సాహిల్, జోష్వాద్, సాధిక్, సిద్ధిక్, విపుల్ కృష్ణ, హస్టిల్, జస్వంత్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, కార్యదర్శి అబ్దుల్ సలామ్ అభినందించారు. ఈ పోటీలకు షాహిద్, మసూద్, స్టీఫెన్ జాన్‌పాల్, మేరిస్టెల్లా, వినీత రెఫరీలుగా వ్యవహరించారు. జిల్లా సభ్యులు ఎస్‌డీ సలావుద్దీన్, జె.ముఖేష్‌కుమార్, పి.అఖిల్, పి.ప్రశాంత్, సీహెచ్ ప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పేద ప్రజలే సీఎం జగన్‌కు అండ

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద ప్రజలు అండగా ఉన్నారని, ప్రతిపక్షనేత చంద్రబాబు వైపు అందరూ కోటీశ్వరులేనని, వీరిరువురి మధ్య జరిగే యుద్ధమే ఎన్నికలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే సోమవారం ఇందుకూరుపేట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నమ్మి ఓట్లేసిన రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేశారని తెలిపారు. ఇందుకూరుపేటలో నాబార్డ్ నిధులు రూ.3.95 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించుకున్నామని తెలిపారు. అలాగే బుచ్చి సామాజిక ఆరోగ్య కేంద్రం కోసం రూ.3.15 కోట్లతో భవనం నిర్మించి ప్రారంభించామని తెలిపారు. మైపాడులో రూ.1.54 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి టెండర్లు పిలిచామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. తొలుత జగదేవిపేటలో కోసలరామ గిరిజనకాలనీలో రూ.3.60 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, లైన్లు, వీధిలైట్లను ప్రారంభించారు. అలాగే ఆదెమ్మసత్రం జగనన్న కాలనీలో రూ.5.82 లక్షలతో ఏర్పాటు చేసిన 3 ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, వీధిలైట్లను ప్రారంభించారు. అనంతరం కొత్తూరులో నూతన పింఛన్లను, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 21 పొదుపు సంఘాలకు రూ.3 కోట్ల బ్యాంక్ రుణాల చెక్కును అందజేశారు. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా దుస్తులను క్రీడాకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, విద్యుత్‌శాఖ ఏడీ సునీల్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు కైలాస లావణ్య, అద్దంకి మమత, నాయకులు గురజాల బుజ్జిబాబు, కైలాసం శ్రీనివాసులురెడ్డి, భీమవరపు వెంకట కృష్ణారెడ్డి, కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, షేక్ షబ్బీర్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యురాలితో కలిసి ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

మహారుద్రాభిషేకం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి పీఠం అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఈ నెల 20న కొడవలూరు మండలంలోని రాజుపాళెంలో 40 మంది వేదపండితులతో శ్రీనారికేళ సహిత రసలింగేశ్వర(పాదరసం) మహారుద్రాభిషేకం ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. లక్ష కొబ్బరి కాయలు, లక్ష రుద్రాక్షలు, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చనతోపాటు సుదర్శన యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్న పేదల పెన్నిధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అందరూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం జలదంకిలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు పడిగాపులు కాయాల్సి వచ్చేదని, జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేసిన వారికే పింఛన్ ఇచ్చేవారిని గుర్తుచేశారు. అనంతరం జలదంకి మండలంలో మంజూరైన 106 నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. నాలుగు పొదుపు గ్రూపులకు బ్యాంకుల నుంచి ఒక్కో గ్రూపునకు రూ.20 లక్షల చొప్పున రుణం మంజూరు కాగా బ్యాంకు చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం వృద్ధులు, వితంతువులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మేదరమెట్ల శివలీల, సొసైటీ డైరెక్టర్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ బత్తిన సింగయ్య, తహసీల్దార్ రమణారావు, నాయకులు రావి ప్రసాద్‌నాయుడు, సురె వెంకటశేషారెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, దామెర్ల దేవదాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : భారత రాజ్యాంగం భగవద్గీత లాంటిదని, ప్రతి ఒక్కరూ చదివి రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'జన్ భాగీదారి' కార్యక్రమంలో భాగంగా 'అంబేడ్కర్ స్మృతి వనం – సామాజిక న్యాయ శిల్పం' ఆవిష్కరణను పురస్కరించుకుని కలెక్టర్ నేతృత్వంలో సోమవారం నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వీఆర్సీ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ ఆదాల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ప్రతి పౌరుడికి న్యాయం జరిగేలా, అందరికీ ఆమోదయోగ్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల తో రాజ్యాంగ రచనకు కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కమిటీ రూపొందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడు సమాజంలో జీవించడానికి సమాన హక్కులు, బాధ్యతలు కల్పించిందని తెలిపారు. అనంతరం భారత దేశాన్ని సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నెలకొల్పేందుకు పునరంకితమవుతామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ ఆదాల, ప్రజాప్రతినిధులు, అధికారులు

కలెక్టరేట్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

• ఇంటిని కూల్చేశారంటూ ఆవేదన

నెల్లూరు(దర్గామిట్ట): తన ఇంటిని అక్రమంగా కూల్చేశారని, ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా తన కుటుంబానికి న్యాయం జరగలేదంటూ నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెం పంచాయతీ ఇసనాకారిపాళెంకు చెందిన మర్లపాటి మురళి ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగింది. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం జరుగుతున్న తిక్కన ప్రాంగణం వద్దకు భార్యాపిల్లలతో వచ్చిన మురళి ఒక్కసారిగా ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న సీఐ కోటేశ్వరరావు అడ్డుకొని అధికారులకు సమాచారం ఇవ్వడంతో జేసీ కూర్మనాథ్ ఆదేశాల మేరకు డీఆర్‌ఓ లవన్న బాధితుడి వద్దకు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవరపాళెంలో ఎంతో కాలంగా వారసత్వంగా వచ్చిన ఇంట్లో తాము నివసించేవారమని, ఇటీవల అధికారులు ఆ ఇంటిని అక్రమంగా తొలగించారని, అప్పటి నుంచి కుటుంబంతో సహా చెట్ల కింద ఉంటున్నామని మురళి వాపోయాడు. ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తమను ఇబ్బంది పెడుతున్నారని, దీంతో విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించానని తెలిపాడు. అనంతరం డీఆర్‌ఓ సంబంధిత తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.



బాధితుడి వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌ఓ లవన్న

90 శాతం రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో 90 శాతం రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించగలిగామని, మరో 10 శాతం సాంకేతిక పరమైన సమస్యలు ఉంటే త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో మంత్రి పాల్గొని రైతులు అందించిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత వీఆర్వోలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులతో పలు దఫాలు సమీక్షలు నిర్వహించిన తర్వాత రెవెన్యూ సమస్యలు కొలిక్కి వచ్చినట్లు తెలిపారు. రైతులకు పట్టాల పంపిణీ తర్వాత వచ్చిన సమస్యలపై సమీక్ష నిర్వహించేందుకు వచ్చినట్లు చెప్పారు. మిగిలిన పట్టాలను సంక్రాంతి పండగ తర్వాత అందజేస్తామన్నారు. రీసర్వేలో సాంకేతిక కారణాల వల్ల భూయాజమాన్య హక్కులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఆదేశించామన్నారు.



వీఆర్వోల ద్వారా వివరాలు తెలుసుకుంటున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

దందాలకు అలవాటు పడిన సోమిరెడ్డి

ఇప్పటికే ఐదు పర్యాయాలు ఓడిన టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లిలో చందాలు, దందాలకు అలవాటు పడ్డారని మంత్రి కాకాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమిరెడ్డి ఎన్నికల సమయంలో చందాలు, దందాలు చేసుకుని కొంత నగదు సమకూర్చుకుని రాజకీయాలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని రకాలుగా భూములను పంపిణీ చేస్తుందో కూడా తెలియకుండా సోమిరెడ్డి నోటికొచ్చినట్టు ఆరోపణలు చేయడం తెలివితక్కువ తనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఎస్ సాయిగణేష్‌బాబు, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఆర్.దశరథరామయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో వ్యక్తి దారుణ హత్య

• పాతకక్షలతోనే కడతేర్చిన వైనం
• పోలీసుల అదుపులో నిందితులు?

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని స్నేహితులే విచక్షణా రహితంగా కత్తి, బీర్‌బాటిల్‌తో దాడిచేసి హత్య చేశారు. ఈ సంఘటన సోమవారం పట్టపగలు నెల్లూరు వైఎంసీఏ గ్రౌండ్ సమీపంలోని నూతన కూరగాయాల మార్కెట్ ఆవరణలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌లో షేక్ ఆసిఫ్ అలియాస్ ఘోరా(35), మున్నీ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి పద్నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నారు. ఘోరా డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకో సాగాడు. ఘోరా పాత నేరస్తుడు. ఏడాది కిందట మున్నీ కువైట్‌కు వెళ్లి ఆదివారమే బుచ్చికి వచ్చింది. అందరూ సంతోషంగా ఉన్నారు.

పాతకక్షల నేపథ్యంలో హత్య

బుచ్చిరెడ్డిపాలెం శాంతినగర్‌కు చెందిన షాకీర్, అస్లాం అన్నదమ్ములు. వారు నెల్లూరు వైఎంసీఏ గ్రౌండ్ సమీపంలో రోడ్డుపై తోపుడుబండ్లలో పండ్లు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అస్లాం స్థానికంగా ఉంటుండగా షాకీర్ నెల్లూరు డైకస్‌రోడ్డులో ఉంటున్నారు. ఘోరాకు వీరు స్నేహితులు. వీరి మధ్య పాతకక్షలున్నాయి. ప్రస్తుతం ఓ కేసు కోర్టులో ఉంది. కొంతకాలంగా కేసు రాజీ విషయమై వీరి మధ్య చర్చలు జరుగుతున్నాయి. అందుకు కొంత ఖర్చు అవుతుందని ఘోరా తన భార్యకు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం ఫ్రెండ్స్ పార్టీ ఉందని భార్యకు చెప్పి నెల్లూరుకు వచ్చారు. అనంతరం షాకీర్‌తో కలిసి నూతన కూరగాయల మార్కెట్ ఆవరణలో మద్యం సేవిస్తుండగా అస్లాం అక్కడకు వచ్చాడు. అందరూ కలిసి మద్యం సేవించారు. అక్కడ వారి మధ్య మాటామాటా పెరిగింది. కోపోద్రిక్తులైన అన్నదమ్ములు కత్తులు, బీర్‌బాటిళ్లతో ఘోరాపై దాడికి దిగారు. అటుగా వెళుతున్న ఇద్దరు వ్యక్తులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. నిందితులు విచక్షణా రహితంగా ఘోరాపై దాడిచేసి పరారయ్యారు.



కొనఊపిరితో ఉన్న ఆసిఫ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది



ఆసిఫ్ (ఫైల్)

ఆస్పత్రికి తరలింపు


స్థానికులు చిన్నబజారు పోలీసులకు, 108కు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కొన ఊపిరితో ఉన్న ఘోరాను జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే ఘోరా మృతిచెందారు. చిన్నబజార్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజు, ఎస్‌ఐ సైదులు సంఘటనా స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీకెమెరాలను పరిశీలించారు. కెమెరాల్లో హత్య చేసిన తీరు రికార్డయి ఉండటంతో ఫుటేజ్‌లను సేకరించారు. ఘోరా మృతి విషయం తెలుసుకున్న భార్య, కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు హత్యకేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆరాతీశారు.

పోలీసుల అదుపులో నిందితులు?

ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టింది. పరారీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. మృతుడు బతికుంటే తమ ప్రాణాలకు ముప్పనీ, దీంతోనే అడ్డు తొలగించామని నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.31
సన్నవి : రూ.20
పండ్లు : రూ.7



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 88	బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	186
లేయర్ (లైవ్)	: 80		
బ్రాయిలర్ చికెన్	: 166	లేయర్ చికెన్	: 136

